క్లుప్తంగా

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నెల్లూరు (టౌన్): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. జనాభా పెరుగుదలతో సంభవించే నష్టాలను ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలియజేశారు. ప్రపంచ జనాభాపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను సెట్నెల్ ఆధ్వర్యంలో నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సెట్నెల్ సీఈఓ నాగరాజకుమారి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గయాజ్, సెట్నెల్ మేనేజర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నెల్లూరు సిటీ: ఫైలేరియాతో బాధపడుతున్న రంగనాయకులపేటకు చెందిన సుధాకర్‌కు రూ.ఐదు వేల సాయాన్ని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు రమేష్‌రాజు మాట్లాడారు. స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న సుధాకర్ భార్య కరోనాతో మూడేళ్ల క్రితం మృతి చెందారని, ప్రస్తుతం తన ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి ఉంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో సాయాన్ని అందజేశామని పేర్కొన్నారు. సాయిరెడ్డి, సాయితేజ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నగరంలో వాహన తనిఖీలను ట్రాఫిక్ అధికారులు మంగళవారం చేపట్టారు. నిబంధనల ఉల్లంఘనలపై భారీగా జరిమానాలు విధించారు. చలానాలు చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతున్న పలు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. చలానాలు చెల్లించిన అనంతరం వాహనాలను విడిచిపెట్టారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను సౌత్ ట్రాఫిక్ ఎస్సై వెంకట్రావు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు తగవని, వీరిపై పోలీసులు తగు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మొగరాల సురేష్ పాల్గొన్నారు.

డీడీ కార్యాలయంలో దంత వైద్య శిబిరం

నెల్లూరు (దర్గామిట్ట): నగరంలోని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దంత వైద్య శిబిరాన్ని స్మైల్ సూపర్ స్పెషాల్టీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని డిప్యూటీ డైరెక్టర్ సదారావు ప్రారంభించారు. అనంతరం వైద్యులు భవానీ 32 మందికి దంత పరీక్షలు చేశారు. సమాచార శాఖ కార్యాలయ ఏఈఐఈ కిషోర్, డివిజన్ పీఆర్వో రమేష్, ఏపీఆర్వో రవీంద్ర, పీఆర్వో వినోద్, ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు సువర్ణ, ఖాదర్‌మస్తాన్ జూనియర్ అసిస్టెంట్ భవానీ, తదితరులు పాల్గొన్నారు.

మౌన దీక్ష నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏఐసీసీ పిలుపు మేరకు మౌన దీక్షను బుధవారం నిర్వహించనున్నామని, కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నేతలు మోహన్, వెంకట్రావ్, ఫయాజ్, అనిల్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల బోడిగాడితోట ఫీడర్‌లో మైపాడు రోడ్డును వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్ హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నాలుగో డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీప్రత్యూష పేర్కొన్నారు. 4 / 1, 2, 3 సచివాలయాలకు సంబంధించి డివిజన్లోని న్యూ కాలనీలో గల యూపీహెచ్‌సీ ప్రాంగణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడారు. మంజూరు చేసిన టోకెన్ల ఆధారంగా ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశామని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లురెడ్డి, ఆర్వో శ్రీనివాసులు, ఆర్ఐ కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వివరిస్తాం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు త్వరలో వివరిస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 40వ డివిజన్ మూలాపేటలోని రామిరెడ్డి బంగ్లా, రావిచెట్టు సెంటర్, గొల్లవీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాలపై ప్రతి ఇంటికీ వెళ్లి తెలుసుకొని, అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లను పిలవనున్నామని పేర్కొన్నారు. పాదయాత్ర పేరుతో విహారయాత్రలా ఇటీవల వచ్చిన కొందరు నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్ అభివృద్ధి ఏమీ చేయలేదంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. హరనాథపురం జంక్షన్లోని ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయిందని, శెట్టిగుంట రోడ్డును వెడల్పు చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టామని వివరించారు. మైపాడు రోడ్డును మరో నెల్లో నాలుగు వరుసల రహదారిగా మార్చి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఇవన్నీ తన హయాంలో జరిగాయని గుర్తుచేశారు. తాము అభివృద్ధి చేసిన ప్రాంతాల్లో తిరగమని టీడీపీ నేతలు అనుకుంటే, చాలా ప్రాంతాల్లో పర్యటించే పరిస్థితి కూడా ఉండదని స్పష్టం చేశారు. జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఖాయం

వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు మహిళలు గుణపాఠం చెప్పడం ఖాయమని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 44, 47వ డివిజన్లకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పాత మున్సిపల్ ఆఫీస్‌లో ప్రారంభించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఒక్క నగర నియోజకవర్గంలోనే ఇప్పటికి సుమారు 20 వేల మందికి పైగా జగనన్న సురక్ష సేవలను అందిస్తున్నామన్నారు. వలంటీర్లలో మహిళలే అధికంగా ఉన్నారని, వీరిపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. 2009లో తాను ఓడిపోయానని, అయితే నెల్లూరు వదిలి పారిపోలేదని చెప్పారు. నిత్యం ప్రజల్లో తిరిగి వారి ఆశీస్సులతో 2014లో ఎమ్మెల్యేగా గెలిచానని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన నారాయణ నాలుగేళ్ల పాటు నెల్లూరులో లేరని, కనీసం కరోనా, వరదల సమయాల్లో కనిపించకుండా, ఇప్పుడొచ్చి రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తానని చెబుతున్నారన్నారు. ఇలాంటి వ్యక్తి ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలకు అండగా ఎందుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికల్లో నారాయణ పోటీ చేయాలంటే రూ.200 కోట్లు అవసరమని, దీనికి ఆయన విద్యాసంస్థల్లో ఫీజులు పెంచేసి తల్లిదండ్రులపై భారం మోపి వ్యాపారం చేస్తారే తప్ప జేబులో నుంచి ఒక్క రూపాయి కూడా తీయరని చెప్పారు. కమిషనర్ వికాస్ మర్మత్, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు పోట్లూరి రామకృష్ణ ఆచారి, నీలి రాఘవరావు, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ పాలనలో సంతృప్తిగా ప్రజలు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



కరపత్రాన్ని అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 28వ డివిజన్లోని చైతన్యపురిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 38వ డివిజన్లో రూ.40 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, కాలువ నిర్మాణానికి శంకుస్థాపనను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేపట్టారు. నియోజకవర్గంలోని ప్రాంతాల అభివృద్ధికి రూ.62 కోట్లు మంజూరు కాగా, డివిజన్‌కు రూ.కోటిని వెచ్చించనున్నామని వెల్లడించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ అమృత, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో లబ్ధి



నెల్లూరు రూరల్: జగనన్న సురక్షతో అన్ని వర్గాలకు ఎనలేని లబ్ధి చేకూరుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. గొల్లకందుకూరులోని సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆర్డీఓ మలోల, రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ గోపీ, గొల్లకందుకూరు, సజ్జాపురం సర్పంచ్‌లు దొరసానమ్మ, నారాయణ, ఉప సర్పంచ్ కొండయ్య, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నేతలు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పెంచలనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏసీబీ తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు తమ సిబ్బందితో కలిసి తనిఖీలను మంగళవారం కొనసాగించారు. స్వామివారి బంగారు, వెండి ఆభరణాలను పరిశీలించారు. అప్రైజర్ల సమక్షంలో వాటి బరువును తూకం వేశారు. 15.309 కిలోల బంగారం, 247.650 కిలోల వెండికి గానూ 250 గ్రాముల బంగారం తగ్గిందనే అంశాన్ని గుర్తించారని సమాచారం. పలు అవకతవకలను అధికారులు గుర్తించారని తెలిసింది. 2019 నుంచి ఇప్పటి వరకు స్వామివారికి భక్తులు అందజేసిన బంగారు, వెండి కానుకలను నిబంధనల ప్రకారం అప్రైజర్‌తో తనిఖీ చేయించి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉండగా, అలాంటిదేమి జరగలేదని తనిఖీల్లో గుర్తించారని సమాచారం. వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు.

గోరింటాకు అలంకారంలో కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస మంగళవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గోరింటాకు అలంకారంలో దర్శనమిచ్చారు. మూలవర్లు, ఉత్సవమూర్తి, ఆలయాన్ని 300 కిలోల గోరింటాకుతో తీర్చిదిద్దారు. దేవస్థాన పాలకమండలి గౌరవాధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, అర్బన్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు శోచనీయం



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 17వ డివిజన్లో గల ఆకుతోటలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థలో ఒకరిద్దరు తప్పులు చేసి ఉంటే వారిని మాత్రమే విమర్శించాలని, అందరిపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. అనంతరం వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కమిషనర్ వికాస్ మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా జాతర ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని జయలలితనగర్‌లో గల ముత్తుమారియమ్మ దేవస్థాన జాతరను వేడుకగా మంగళవారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కాంక్షించారు. రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వందవాసి రంగ, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

నెల్లూరు(బారకాసు): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని డ్రెయిన్లలో పూడికతీత పనులను చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని 47వ డివిజన్ కోటమిట్ట, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొన్ని వీధుల్లో చెత్తను బహిరంగంగా వేయడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ రామకృష్ణ, ఎంహెచ్ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

45 / 2 రామ్మూర్తినగర్ వార్డు సచివాలయాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని సూచించారు.

బలవంతపు కన్వర్షన్‌ను నిలిపేయాలని వినతి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఫిజికల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని గణిత ఉపాధ్యాయులుగా బలవంతంగా మార్చడాన్ని మానుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, ఏడుకొండలు కోరారు. నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 67 గణిత ఉపాధ్యాయుల అవసరం ఉందని తెలిపారు. గణిత ఉపాధ్యాయులుగా మారేందుకు 13 మంది అంగీకారం తెలిపారని, మిగిలిన వారిని బలవంతంగా మార్చడాన్ని మానుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల నిరసన

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమం 36 గంటల అనంతరం మంగళవారం ముగిసింది. తొలుత మానవహారంగా ఏర్పడ్డారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ పాల్గొన్నారు.

బియ్యం లారీ సీజ్

నెల్లూరు(పొగతోట): నూకల పర్మిట్ పేరుతో అక్రమంగా తరలిస్తున్న 600 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఇతర జిల్లాల నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ అంకయ్య కొడవలూరు ప్రాంతంలో లారీని పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు అవసరమైన నగదును లబ్ధిదారులైన గ్రూపు సభ్యులకు బ్యాంకుల నుంచి మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర ఆదేశించారు. నగరంలోని మెప్మా కార్యాలయంలో గల తన చాంబర్ నుంచి టీఈ, సీఎంఎం, సీఓలతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆసరాకు సంబంధించిన మిగిలిన అంశాలను యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు.

విద్యార్థినులకు అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పొదలకూరు రోడ్డులోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఐటీడీఏ పీఓ రాణి, దిశ డీఎస్పీ సురేష్‌బాబు, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు వర్షాకాలంలో ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పొలాల్లో విద్యుత్ తీగలు తెగి ఉంటే 1912 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ మరమ్మతు పనుల సమయంలో భద్రత ప్రమాణాలను పాటించాలని చెప్పారు.

అధిక జనాభాతో అనర్థాలు

నెల్లూరు(బారకాసు): అధిక జనాభా అనర్థాలకు దారితీస్తుందని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనాభా నియంత్రణ పద్ధతులను ఆచరించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను ఆచరించిన వారిలో లక్కీడిప్‌లో ఎంపికైన వారికి ప్రోత్సాహక పారితోషికంగా రూ.ఐదు వేలను చెక్కు రూపంలో అందజేశారు. ఉత్తమ సేవలందించిన వైద్యాధికారులు పద్మావతి, పద్మజ, అమరేంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసపత్రాలను అందజేశారు. ఎఫ్‌పీసీ నోడల్ అధికారి దయాకర్, డీఎల్వో ఇన్‌చార్జి బ్రిజిత, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, ఎస్ఓ సహనా, తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి

నెల్లూరు(దర్గామిట్ట): బడి బయట ఉన్న పిల్లల సర్వేను త్వరగా పూర్తి చేయాలని, వీరు పాఠశాలల్లో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. బడి బయట ఉన్న పిల్లల సర్వేపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. డీఈఓ గంగాభవానీ, డీడీ సోషల్ వెల్ఫేర్ రమేష్, ఆర్ఐఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే సర్వే, రెవెన్యూ అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. రీ సర్వేపై ఆర్డీఓలు, సర్వే అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, సబ్ కలెక్టర్ శోభిక, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, కరుణకుమారి, సర్వే ఏడీ హనుమాన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి ఫిర్యాదులో వాస్తవం లేదు

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని కనుపూరు చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తూ.. చెరువు నీటిని నింపకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ స్పందన కార్యక్రమంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని నెల్లూరు సెంట్రల్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీరు – చెట్టు పథకంలో భాగంగా చెరువులు, రిజర్వాయర్లలో నీటి మట్టాన్ని పెంచేందుకు, భూగర్భ జలాలను అభివృద్ధి చేసేందుకు గానూ రైతులు, ప్రైవేట్ వ్యక్తులు తమ సొంత ఖర్చులతో మట్టిని తోలుకునేందుకు ఒక క్యూబిక్ మీటర్‌కు రూపాయి రిఫండబుల్ కాషన్ డిపాజిట్ ప్రకారం అనుమతులను మంజూరు చేశామని చెప్పారు. చెరువు కట్టలు, రిజర్వాయర్లకు ఎలాంటి నష్టం కలగకుండా మట్టిని తరలించేందుకు అనుమతులను మంజూరు చేశామని పేర్కొన్నారు. రెండో పంటలో భాగంగా కనుపూరు చెరువులో 40 శాతానికి పైగా నీటిని నింపి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. స్పందన కార్యక్రమంలో ఆయన అందజేసిన అర్జీ వాస్తవ విరుద్ధమని పేర్కొన్నారు.